హామీలను నిలబెట్టుకోవాలి

- జర్నలిస్టులను తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించాలని ప్రభుత్వానికి డిమాండ్

నీతాఫల్‌మండిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 7: సికింద్రాబాద్ నియోజకవర్గం నీతాఫల్‌మండిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యంగౌడ్, జనరల్ సెక్రటరీ చందు ఆధ్వర్యంలో తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించారు. ఏప్రిల్ 13న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ జర్నలిస్టు ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ బైరాగి, టీయూ జేఏసీ సెక్రటరీ జెనరల్ తుమ్మల ప్రపుల్‌రాంరెడ్డి, చర్ల చంద్రన్న ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు బ్రహ్మం, చికోటి శ్రీనివాస్, భాస్కర్, కె.రాజేంద్రప్రసాద్, మద్దెర్ల కిరణ్, శ్యామ్, ఉద్యమ కళాకారుల వేదిక అధ్యక్షుడు వేముల యాదగిరి తెలిపారు. భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల పరిస్థితి నేడు ఆగమ్యగోచరంగా మారిందని, తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు వార్తలు రాసి ఉద్యమాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులతో పాటు, ఉద్యమ వార్తలు రాసిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫొటో, వీడియో, డెస్క్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలిపిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. తెలంగాణ జర్నలిస్టుల సమ్మేళనం కార్యక్రమంలో ఫోటో, వీడియో, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని విజయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కళాకారుల వేదిక డోలక్ యాదగిరి, సాయిలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడిపితే చర్యలు తప్పవు

ఆలుగడ్డ బావి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది

అడ్డగుట్ట, ఏప్రిల్ 7: మైనర్లు బండి నడిపితే కఠిన చర్యలను తీసుకోవడం జరుగుతుందని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆలుగడ్డ బావి చౌరస్తా వద్ద ఆయన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ వెహికల్ చట్టం 1988 ప్రకారం మైనర్లు వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలకు అర్హులవుతారని ఆయన స్పష్టం చేశారు. తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మే 13న పాలీసెట్

మేడ్చల్, ఏప్రిల్ 7: మే 13న పాలీసెట్ నిర్వహించనున్నట్లు మేడ్చల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రవేశ పరీక్ష రుసుం రూ 250 కాగా, ఇతరులు రూ.250 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల19 చివరి తేదీ అని తెలిపారు. పదో తరగతి పరీక్ష రాసిన వారు కూడా ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత

విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రతినిధులు

బేగంపేట్, ఏప్రిల్7: ప్రతిభావంతులైన విద్యార్థుల చదువు మధ్యలోనే నిలిచిపోవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లి తన కార్యాలయంలో ముగ్గురు పేద విద్యార్థులకు సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.2.45 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. గిర్కాల శ్రావణి ఎమ్మెస్సీ మొదటి సంవత్సరం చదువు కోసం 2 లక్షలు, దత్తా ఇంటర్మీడియట్ కోసం 20 వేలు, వీరు ఇంటర్ చదువు కోసం 25 వేల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద రికం కారణంగా అనేకమంది మధ్యలోనే తమ చదువులకు ముగింపు చెబుతున్నారని, ఇది బాధాకరం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి విద్యావంతులను చేయడం ద్వారా వారికి బంగారు భవిష్యత్‌ను అందించిన వారవుతారని చెప్పారు. పేదలను ప్రోత్సహించే విధంగా ఆర్థిక సహాయం అందిస్తున్న సంకేత్ ఆర్గనైజేషన్ నిర్వాహకులను అభినందించారు. ఆర్గనైజేషన్ ఫౌండర్ మురళి, అధ్యక్షుడు మమత, ఉపాధ్యక్షురాలు ధనశ్రీ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ హెడ్‌గా ప్రొ.సతీష్


ప్రొఫెసర్ సతీష్ కుమార్‌ను అభినందిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ పి.సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన హెడ్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారం. ఈ సందర్భంగా ఆయనను విద్యార్థులు కలిసి పుష్పగుచ్చంతో స్వాగతం తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకుడు తోట శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు రవీందర్, వినోద, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

మూలవాసుల భీమరామోత్సవాలు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 7: మూలవాసుల మాసోత్సవం సందర్భంగా భీమరామోత్సవాలు విశ్వజన కళామండలి సౌజన్యంతో షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో చాచా నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్‌లో విశ్వగురు సంత్ రవిదాస్ జయంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రోహిదాస్ వాగ్మారే హాజరై మాట్లాడుతూ సంత్ రవిదాస్ జీవిత చరిత్రను వివరించారు. అనంతరం జానపద కళానిధి మాస్టార్జీ ఆలపించిన పలు సామాజిక చైతన్య గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎస్సీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు రాగాల నాగేశ్వరరావు, నగర ఉపాధ్యక్షులు కుర్మ మహేందర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు మాచర్ల ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కుర్మ లక్ష్మిపతి, విజయశంకర్, బీజేపీ నాయకులు కేఎం. కృష్ణ, వై.సురేష్‌కుమార్, ఎస్సార్ మల్లేష్, మానవ హక్కుల కమిషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అగ్రిప్ప, ఎం.రేణుక, డి.శంకర్, స్వర్ణ రాజ్, రాపాక అశోక్, బి.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత మాస్టార్జీ

మే 7 నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె


ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ ఈదు వెంకన్న, హనుమంత్ ముదిరాజ్, థామస్‌రెడ్డి, సుద్దాల సురేష్, తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 7: తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. మే 7 నుంచి ఆర్టీసీ సమ్మె ప్రారంభమవుతుందని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జనవరి 27న సమ్మె నోటీసు ఇచ్చిన యాజమాన్యం, ప్రభుత్వం, కార్మిక కమిషనర్ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో చలో లేబర్ కమిషనర్ ఆఫీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేఏసీ చైర్మన్ ఈదు వెంకన్న, కోచైర్మన్ హనుమంత్ ముదిరాజ్, వైస్‌చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, జేఏసీ కోకన్వీర్ సుద్దాల సురేష్ తదితరులు మాట్లాడుతూ సమ్మె నోటీసులో 21 అంశాలు ప్రస్తావించామని ఆ సమస్యల కోసం ప్రభుత్వం, యాజమాన్యాలను ఎన్నోసార్లు ప్రస్తావించిన స్పందన రాకపోవడంతో సమ్మె అనివార్యమైందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన నేటి వరకు ఆ సమస్య కొలిక్కి రాలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన నేటి వరకు ఆ సమస్యను పరిష్కరించుకోలేకపోయారని విమర్శించారు. ట్రేడ్ యూనియన్ల రిప్రజెంటేషన్ లేకపోవడం వల్ల కార్మికులు యాజమాన్యం ఒత్తిడి, వేధింపులకు గురవుతున్నారని అన్నారు. 2017 వేతన సవరణ జరిగిన నేటికీ ఎరియర్స్ రాకపోవడం విచారకరమన్నారు. డ్రైవర్ ఏకధాటిగా 500 నుంచి 600 కిలోమీటర్ల వరకు బస్సులు నడపడం సాధ్యం కాదని సింగిల్ డ్యూటీ మీటర్లను చట్టప్రకారం నిర్ణయించాలని కోరారు. డ్రైవర్ కండక్టర్లను చిన్న తప్పిదాలకే సస్పెన్షన్లు చేయడం సరికాదన్నారు. మహాలక్ష్మి పథకం లో ప్రయాణికుడి కంప్లైంట్ మేరకు కండక్టర్ తప్పిదం లేకపోయినా సస్పెన్షన్ చేసిన దాఖలాలు అనేకం ఉన్నాయనిపేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్‌లు మ్యానుఫ్యాక్చర్ నుంచి హాయ్ బేసిస్‌లో తీసుకోవడం వల్ల సంస్థ ఉనికి ప్రమాదంలో పడుతుందన్నారు. రిక్రూట్మెంట్ లేకపోవడం వల్ల ఉద్యోగులపై భారం పెరుగుతుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగర కార్మిక సంయుక్త కమిషనర్ సునీతకు వినతిపత్రం ఇచ్చారు. జేసీ కన్వీనర్ హిందీ మాలానా, కోకన్వీనర్ కత్తుల యాదయ్య, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ కోకన్వీర్ సుద్దాల సురేష్, బి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాలా నిర్మాణ పనుల పరిశీలన

నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట, ఏప్రిల్ 7: డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మెట్టుగూడ డివిజన్ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. విజయపురి కాలనీలో జరుగుతున్న నాలా నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా ఆమె అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని అన్నారు.

జీవనశైలిలో మార్పులు అత్యవసరం

రైతులను సన్మానిస్తున్న వీరయ్య తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 7: బీపీ, షుగర్ పేషెంట్లకు మందుల వాడకంతో పాటు, జీవనశైలిలో కూడా మార్పులు అవసరమని ప్రముఖ డాక్టర్లు హెచ్చరిస్తున్నారని హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో అవగాహన కార్యక్రమం జరిగింది. మెడికల్ క్యాంప్‌లో ఉచిత సేవలు అందిస్తున్న డాక్టర్లను సన్మానించారు. డాక్టర్ రాజును హెచ్‌సీఎఫ్ ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, డాక్టర్ నాగును ఉపాధ్యక్షుడు మోహన్‌నాయుడు తదితరులను ఘనంగా సన్మానించారు. వీరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ నాయకులు పి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, సంగీత, అస్మిత, నాగేష్, రాజమౌళి, సైదులు, సుకుమార్, గోపాల్, శంకర్, మహేందర్, శంకరయ్య, రమేష్, రవీంద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఇటీవల సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది గుంటి మల్లికార్జున్‌ను సన్మానించారు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన పట్టుదలతో న్యాయవాద వృత్తిలో రాణిస్తున్నారని అన్నారు. విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షుడు మాస్టార్జీ, ఎస్సీఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, అగ్రిప్ప, స్వరన్‌రాజ్, జేఏసీ నాయకులు లక్ష్మిపతి, విజయశంకర్, ప్రభాకర్, మహేందర్, కృష్ణ, అశోక్, శ్రీకాంత్, శివకుమార్‌లాల్, మల్లేష, శ్రీనివాస్, సదానందం, సాయిరాం సన్మానించారు. – బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 7:

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

బొల్లారం, ఏప్రిల్ 7: హత్య కేసులో నిందితుడికి సికింద్రాబాద్ 6వ అదనపు సెషన్స్ ఎస్సీ, ఎస్టీ కోర్టుల న్యాయమూర్తి ఎస్.శ్రీవాణి సోమవారం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మినారాయణరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం న్యూబోయిన్‌పల్లికి చెందిన కె.శివ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017 డిసెంబర్‌లో జరిగిన మృతురాలు స్వప్న హత్య కేసులో నిందితుడు. అప్పటి ఇన్‌స్పెక్టర్ పీఆర్ రంగయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్స్ ఎం రవికిరణ్, సీహెచ్ ప్రశాంతరావు, రాజేష్ కేసులో సరైన సాక్షాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.ఉపేందర్ బాధితుల పక్షాన కేసును వాదించి నిందితుడికి శిక్ష పడే విధంగా సాక్ష్యాలను న్యాయమూర్తి ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించినట్లయితే మరో 3నెలలు శిక్ష అనుభవించాలని పోలీసులు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ డాక్ నాయక్

బేగంపేట్ ఏప్రిల్ 7: బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్ నాయక్ సోమవారం వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే సిబ్బంది స్పందించాలని సూచించారు. ప్రాపర్టీ ట్యాక్ గత యేడాదిలో రూ.49 కోట్లు కలెక్షన్ అయిందిని ఈసారి అంతకు మించి వసూల్ చేయాలని ఆదేశించారు. ట్యాక్స్ చెల్లించే వారికి 5 శాతం డిస్కౌంట్ ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సర్కిల్ పరిధిలో ఆకాల వర్షాల వల్ల చెట్ల కొమ్మలు విరిగి రోడ్ల మీద పడుతున్నాయని వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే చెత్త, పరిసరాల పరిశుభ్రత తప్పకుండా వెంటవెంటనే క్లీయర్ చేయాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు.

ఘనంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు

నీతాఫల్‌మండి చౌరస్తాలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న గరికపాటి చంద్రశేఖర్ తదితరులు

కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సికింద్రాబాద్, ఏప్రిల్7: సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం కోలాహలంగా జరిగాయి. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, పలు సంఘాల మహిళా, విద్యార్థి, కార్మిక విభాగాల నేతలు వివిధ ప్రాంతాల్లో ఆయన జన్మదిన కార్యక్రమాలను నిర్వహించారు. కార్పొరేటర్లు హేమ, శైలజ, ప్రసన్నలక్ష్మితో పాటు పలు డివిజన్ల లోని బీఆర్ఎస్ నేతలు వివిధ ప్రాంతాల్లో అన్నదానం, అనాథాశ్రమాల్లో పండ్లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. ఆలయాల్లో పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సీతాఫల్‌మండి చౌరస్తా లో బీఆర్ఎస్ సీనియర్ నేత గరిగపోగుల చంద్రశేఖర్ అధ్వర్యంలో అన్నదానం జరిగింది. సీతాఫల్‌మండి మేడిబావి రెయిన్‌బో హోమ్ విద్యార్థులతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నేత సంజీవ్ ముదిరాజ్ 25కిలోల కేకు కట్ చేశారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ ఆధ్వర్యంలో నామాల గుండు వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. లక్ష్మి, అరుణ, కాంతమ్మ, లలిత, పోతారం శ్రీనివాస్, శైలేందర్, నవీన్, బాలాజీ, రాము, రాజేష్, నవీన్‌గౌడ్, రవి పాల్గొన్నారు. వారాసిగూడలో సీనియర్ నాయకుడు బోళ్ల సుమిత్‌యాదవ్ ఆధ్వర్యంలో పుట్టినరోజు ఘనంగా జరిగింది. నాయకులు క్రాంతి, సరోజ, పింకీ, సాయియాదవ్ పాల్గొన్నారు.

మెట్టుగూడలో కార్పొరేటర్ రాసూరు సునీత ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. వనజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. అడ్డగుట్టలో బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, అమర్, ఎల్లయ్య, వసంత, మహమ్మద్, నర్సింగ్, రామప్పచారి, చిన్న, రజిత, మహేశ్వరి పాల్గొన్నారు.

నీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటుతున్న నాయకురాళ్లు

ఓయూ డిగ్రీ పరీక్షలను వాయిదా వేయాలి

ఓయూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మంగళవారం నుంచి నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను తక్షణమే వాయిదా వేయాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (టీపీడీపీజీఎంఏ) డిమాండ్ చేసింది. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో తాము కళాశాలలు నడిపించే పరిస్థితుల్లో లేమని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పరీక్షలు సైతం నిర్వహించే పరిస్థితి లేదని చెప్పారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ తమకు నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులు వసూలు చేయవద్దని, ఆర్టిఎఫ్ ద్వారా ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని గతంలో చెప్పారని గుర్తుచేశారు. దానిని అనుసరించి విద్యార్థులకు ఉత్తమ బోధన గావిస్తూ అప్పులు చేసి, ఆస్తులు అమ్మి తాము బతుకుతూ తమతోపాటు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న యాజమాన్యాలు ఇప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వివరించారు. భవన యజమానుల అద్దె వేధింపులు, వేతనాల కోసం ఉద్యోగుల ఒత్తిడి, వారి సహాయ నిరాకరణ ఇవన్నీ కాకుండా రోజువారి ఖర్చులకు మరింత సొమ్ము అవసరం పడడంతో ఎంతో కష్టపడాల్సి వస్తుందని చెప్పారు. గతేడాది మార్చి నుంచి ఎన్నో పర్యాయాలు అధికారులు, నాయకులకు తమ గోడు వెళ్లబోసుకున్నప్పటికీ ఫలితం రాలేదని చెప్పారు. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో దసరా సెలవుల అనంతరం (అక్టోబరు 14 నుంచి) యాజమాన్యాలు కళాశాలలను తెరవలేకపోయారన్నారు. దీంతో 17న కొన్ని బకాయిలను విడుదల చేశారని అన్నారు. కనీసం 20 శాతం కూడా విడుదల చేయకుండా కళాశాలలు ఎలా నడపాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, అందుకే పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సీతారాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభిషేకం

ముషీరాబాద్, ఏప్రిల్ 7: రాంనగర్ ఆర్యవైశ్య సంఘం, వాసవి కన్యకా పరమేశ్వరి వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జరుగుతున్న సీతారాముల కల్యాణ వేడుకల్లో భాగంగా సోమవారం సీతారామ పట్టాభిషేకం జరిగింది. అంతకుముందు సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం, దాండియా నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వి.సుధాకర్‌గుప్తా, సత్యవర్ధన్, సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్, చామల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి: నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి వివేక్ నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం శ్రీ రామ పట్టాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు.. దేవాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్య నిర్వహణ అధికారి మాచర్ల దేవానాథంలో కార్యక్రమాలను పర్యవేక్షణలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం సోమవారం పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతారాముల వారి పల్లకి సేవలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు శ్రీనాథ్ గౌడ్, కార్యనిర్మాణాధికారి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు